క్లుప్తంగా

బంగారుమాంబ పరస నేడు



నాతయ్యపాలెంలో కొలువైన అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవత బంగారుమాంబ అమ్మవారి పరస మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలు, నైవేద్యం సమర్పించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యుత్ దీపాలంకరణ మధ్య అమ్మవారి పరస మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారి సన్నిధిలో ఆలయ కమిటీ, నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక సూదికొండపై వెలిసిన శ్రీ మాతా దుర్గా భవానీ అమ్మవారి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ కల్యాణ లక్ష్మి, శ్రీ సంతాన లక్ష్మి, శ్రీ నూకాలమ్మ వార్ల విగ్రహాల ప్రతిష్ఠాపనా మహోత్సవం ఘనంగా జరిగింది. హోమాలు, విశేష పూజలు చేశారు. ఆలయ గోపురంపై పంచామృతాలతోపాటు బూరెలతో అభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త బళ్ల పైడిరాజు దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, సీనియర్ నాయకులు జి.పూర్ణానందశర్మ, వార్డు జనసేన ఇన్‌చార్జ్ గవర సోమశేఖర్, కరణం లక్ష్మి, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కులుకూరి నియామకం



పెదగంట్యాడ: జగనన్న సచివాలయ కన్వీనర్ల పెదగంట్యాడ మండల ఇన్‌చార్జిగా వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కులుకూరి మంగరాజు నియమితులయ్యారు. జీవీఎంసీ 64, 65, 75, 76 వార్డుల్లోని సచివాలయ కన్వీనర్లకు సమన్వయకర్తగా మంగరాజు వ్యవహరించనున్నారు.

స్క్రాప్ దొంగ అరెస్ట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఐరన్ స్క్రాప్ దొంగతనం చేసిన వ్యక్తిని సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది పట్టుకుని స్టీల్‌ప్లాంట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అందించిన వివరాలివి.. పెదగంట్యాడకు చెందిన పిట్లా గురుమూర్తి (35) శనివారం ఉదయం స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగం సమీప రైల్ భవనం వద్ద సుమారు 90 కేజీల బరువు, రూ. 2వేలు విలువ కలిగిన ఐరన్ స్క్రాప్‌ను దొంగతనంగా తరలిస్తున్నాడు. ఇది గమనించిన సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్టీల్‌ప్లాంట్ క్రైం ఏఎస్ఐ రవిరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురంలో కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవం ఆదివారం నిర్వహించేందుకు శ్రీ భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. మండలం రోజులకు (41 రోజులకు) ఒకసారి వచ్చే ఆదివారం ఈ అధివాస మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఒక్కో అధివాసంలో ఒక్కో పత్రితో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారు. ఈ వారం వాకుడు(బృహతి) పత్రితో పూజ నిర్వహించనున్నారు.

ఆర్టీసీ బస్ హబ్ @ పాత గాజువాక

- అందుబాటులో 90 సర్వీసులు
- కార్గో, టికెట్ బుకింగ్‌కూ అవకాశం
- ఆర్టీసీ ఆర్‌ఎం అప్పలరాజు వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలరాజు



పాత గాజువాక బస్ స్టేషన్

గాజువాక : గాజువాక మీదుగా దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులకు స్థానిక లంకా గ్రౌండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పాతగాజువాక బస్ స్టేషన్ హబ్‌గా నిలుస్తుందని ఆ సంస్థ విశాఖ ఆర్‌ఎం ఎ.అప్పలరాజు తెలిపారు. నూతన స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ స్టేషన్ తాత్కాలికంగా అందుబాటులోకి వచ్చిందని, త్వరలోనే పూర్తిస్థాయి సౌకర్యాలతో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. విశాఖ నుంచి ఇటు వివిధ ప్రాంతాలకు వెళ్తున్న 90 సర్వీసులు ఇక్కడ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇక్కడ కార్గో, టికెట్ బుకింగ్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రయాణికుల సర్వీసులతో పాటు ఈ ప్రాంతంలోని కార్గో సమస్యలకు కూడా ఈ స్టేషన్ ఏర్పాటుతో పరిష్కారం లభిస్తుందన్నారు. ఇప్పటివరకు ఇక్కడ కార్గో డెలివరీ లేదని, ఈ స్టేషన్ అందుబాటులోకి రావడంవల్ల ఆ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్గో డోర్ డెలివరీ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. భవిష్యత్‌లో ఈ స్టేషన్ మంచి హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇందులో ప్రస్తుతం రెండు ప్లాట్‌ఫారాలను అందుబాటులోకి తెస్తున్నామని, భవిష్యత్‌లో ఎనిమిది ప్లాట్‌ఫారాలకు విస్తరించే విధంగా ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

త్వరలో ఆన్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ .. ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్‌ను పది రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆర్‌ఎం తెలిపారు. దీనివల్ల మార్గమధ్యలో ఉన్న బస్సులకు కూడా ప్రయాణికులు తమ మొబైల్ నుంచి టికెట్లను బుక్ చేసుకోవచ్చని తెలియజేశారు. విశాఖ నుంచి 250 కిలోమీటర్ల దూరంలో నడిచే బస్ సర్వీసులకు కేవలం రూ.5 అదనపు చార్జీతో రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. టికెట్ బుకింగ్ సమయంలో రిటర్న్ జర్నీ కూడా బుక్ చేస్తే 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులందరూ వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో గాజువాక డిపో మేనేజర్ వి.ప్రవీణ, అసిస్టెంట్ మేనేజర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన పాదయాత్ర

- ఉక్కు ప్రజా గర్జన విజయవంతం చేయాలని పిలుపు

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం ఈ నెల 30వ తేదీన ఉక్కునగరంలోని తృష్ణ మైదానంలో నిర్వహిస్తున్న ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ చేసిన పాదయాత్ర నినాదాలతో హోరెత్తింది. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన యాత్రలో పోరాట కమిటీ నాయకులు, ఉక్కు నిర్వాసితులు, ప్రజాసంఘాల నాయకులు, ఉక్కు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, హోరెత్తించారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి జంక్షన్ నుంచి కణితి గాంధీ బొమ్మ సెంటర్ వరకు పాదయాత్ర సాగింది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు ఉద్యమానికి తలవంచక తప్పదన్నారు, కార్యక్రమంలో ఆదినారాయణ, కార్పొరేటర్ స్టాలిన్, కోమటి శ్రీనివాసరావు, బొండా జగన్ ,కాంగ్రెస్‌గుల భాస్కరరావు, , బొడ్డ గోవింద్, ప్రగడ గోవిందరాజులు, బలిరెడ్డి నాగేశ్వరరావు, కోమటి రమాదేవి, దుగ్గపు దానప్పలు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక

ఉక్కునగరం: ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక పంపాలని స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఉక్కు త్రిష్టా మైదానంలో 30న పెద్ద ఎత్తున నిర్వహించనున్న ప్రజా గర్జన ప్రచారంలో భాగంగా శనివారం స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ కూడలి వద్ద ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే నిర్వాసితులు పూర్తిగా నష్టపోతారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నా, కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. అందుకే పెద్ద ఎత్తున నిరసన తెలిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులను ఆహ్వానించామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ప్రజలు సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసిత కాలనీల్లో విస్తృత ప్రచారం

అగనంపూడి: ప్రజాగర్జనను విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు నిర్వాసిత కాలనీల్లో శనివారం విస్తృత ప్రచారం చేపట్టారు. అగనంపూడి, దువ్వాడ, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీల్లో బృందాలుగా ఏర్పడి విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. శనివారం అగనంపూడి బహుళ అంతస్తు భవనాల ప్రాంతాల్లో, ఉక్కు ఆస్పత్రి రహదారి, కూడళ్లలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు దాసరి త్రినాథ్, పెదిరెడ్ల హరనాథ్, మోటూరి వెంకటరమణ, కరణం పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

- 85వ వార్డు అగనంపూడి సెక్టార్–1,2,3 నిర్వాసిత కాలనీలు, పెదమడక, పినమడక, డొంకాడ, బీసీ కాలనీ, దానబోయిపాలెం, దిబ్బపాలెం కాలనీల్లో ఉక్కు నిర్వాసితులు, ఐక్య వేదిక నాయకులు ర్యాలీలు నిర్వహించారు. ప్రజాగర్జనలో పాల్గొనాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు ఇల్లపు ప్రసాద్, పూర్ణ, శీరంశెట్టి గోవిందరావు, కరణం సత్యారావు, బొబ్బరి సూరి, ఎల్లపు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి మెయిన్‌రోడ్డులో బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్న నిర్వాసిత సంఘాలు



స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ కూడలి వద్ద ప్రచారం



సెక్టార్-1,2ల్లో ప్రచారం చేస్తున్న ఉక్కు పరిరక్షణ, నిర్వాసిత పోరాట కమిటీ ప్రతినిధులు



87వ వార్డు పాదయాత్ర చేస్తున్న ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు

పేదల సంక్షేమం కోసమే పథకాలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదలకు ప్రయోజనం చేకూర్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 76వ వార్డు పరిధిలోని స్వతంత్రనగర్‌లో శనివారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిసి, వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందు చూపుతో ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల కళ్లల్లో వెలుగులు నింపుతున్నాయని చెప్పారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. రాష్ట్రంలోని ప్రతి పేదవానికి ఏదో రూపంలో లబ్ధి చేకూర్చుతూ, వారికి ఆర్థిక ఆసరా అందిస్తున్నారన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పి. ప్రమీల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి



బాలచెరువు శివాలయంలో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువులోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో రథ సప్తమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు జీలకర్ర రమణ, భువనేశ్వరి దేవి ఆధ్వర్యంలో సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ సమస్త జీవ కోటికి ఆహారం అందించేది ప్రత్యక్ష దైవం సూర్యభగవానుడేనని చెప్పారు. కార్యక్రమంలో అప్పారావు, ఆనంద్, గూటూరు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రామనాయుడు, రంజిత్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వం



716వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అన్నింటినీ ఎదుర్కొంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 716వ రోజు, శనివారం సంస్థకు చెందిన ఎంఎంఎస్ఎం, ఎస్‌టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మికులనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్. రామారావు, బీహెచ్‌ఈఎల్ నాయకులు సాహు, రవీంద్రనాథ్ ప్రసంగించారు. విశాఖ ఉక్కు అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు ఉక్కు ప్రజాగర్జనతో గట్టి బుద్ధి చెప్తారన్నారు. బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని వెంటనే ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్రజాగర్జనలో నిర్వాసితులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డి.దేముడు, డి.రమేష్, జి.ఆనంద్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, జి.వి.రమణ, వై.వి.సుబ్బారావు, ఆర్.సూరిబాబు, నమ్మి సింహాద్రి, శ్రీరాములరాజు, మహ్మద్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసుల నమోదు

- ఒక వాహనం సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న రవాణాశాఖ అధికారులు

గోపాలపట్నం: ఫ్యాన్సీనంబర్లపై రవాణా శాఖ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 73 కేసులు నమోదు చేశారు. ఒక వాహనాన్ని సీజ్ చేశారు. ప్రత్యేక బృందాలు బోయపాలెం, ఎన్ఎస్‌టీఎల్, మద్దిలపాలెం, గాజువాక, ప్రాంతాల్లో తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని డీటీసీ రాజారత్నం తెలిపారు.

ఆరో రోజుకు ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



రిలే దీక్ష శిబిరంలో పాల్గొన్న ఎన్ఎంయూ కార్మికులు

ఉక్కునగరం: తమ సమస్యల పరిష్కారం కోసం స్టీల్ సిటీ డిపో ఎన్ఎంయూ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని.. డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలను విరమించుకోవాలని ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఉదయం జోనల్ సెక్రటరీ ఎం.వి.ఆర్. మూర్తి దీక్షలను ప్రారంభించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ సీనియార్టీ కాదని డ్యూటీ చార్టులేయడం, సిబ్బంది గుర్తింపు కార్డుల రెన్యువల్, సిబ్బంది అందుబాటులో ఉన్నా బస్సులు రద్దు చేసే విధానం వంటి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిపో నాయకులు జి.సాయిరాం, ఎం.సూర్యం తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త సాంకేతికతతో ఎన్నో ఆవిష్కరణలు



మాట్లాడుతున్న గీతం ప్రొఫెసర్ శ్రీనివాస్

అగనంపూడి: సాంకేతిక రంగంలో మార్పులను అందిపుచ్చుకుంటూ, పరిశోధనల వైపు అడుగులు వేస్తే నవ్య ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని గీతం డీమ్డ్ యూనివర్సిటీ మెకానికల్ విభాగం హెడ్ వి.శ్రీనివాస్, విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. గీతం వర్సిటీ, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) సౌజన్యంతో శాస్త్ర, సాంకేతిక రంగాలపై (ఎమర్జింగ్ టెక్నాలజీ) జాతీయ స్థాయిలో అధ్యాపకుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 27న ప్రారంభమైన తరగతులు వచ్చే నెల 2వ తేదీ వరకు జరగనున్నాయి. శిక్షణ శిబిరంలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో వస్తున్న మార్పులు, భవిష్యత్తులో రానున్న మార్పులు, ఆవిష్కరణలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ వివిధ విభాగాలు సంయుక్తంగా పరిశోధనలు జరిపితే, ఎన్నో నూతన ఆవిష్కరణలు వస్తాయని, వందేభారత్ ట్రైన్ దీనికి ఉదాహరణ అని అన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల సమన్వయంతో, ఎమర్జింగ్ టెక్నాలజీతో ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బి.సతీష్, వివిధ విభాగాధిపతులు, వివిధ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనకు కాంగ్రెస్ పార్టీ మద్దతు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 30వ తేదీన తలపెట్టిన ప్రజా గర్జనకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతును ప్రకటించిందని నగర ప్రధాన కార్యదర్శి గవర వెంకట రమణారావు తెలిపారు. భెల్ గుర్తింపు యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరం, గాజువాక పరిసర ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో ప్రజా గర్జనలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పోచారెడ్డి రాకేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంపా గోవింద్ వంటి ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. గాజువాక కాంగ్రెస్ కోర్ కమిటీ సభ్యులు ఉరుకూటి అచ్చిబాబు, దొమ్మేటి రమణారావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాచిపాటి స్వర్ణ, ట్రేడ్ యూనియన్ నాయకులు దానబోయిన అప్పలనాయుడు, ఇంటక్ నాయకుడు సీహెచ్.మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు స్టేడియంలో సూర్య నమస్కారాలు



సూర్యనమస్కారాలు చేస్తున్న యోగా సాధకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కల్నల్ సీకే నాయుడు స్టేడియంలో శనివారం సామూహిక సూర్య నమస్కారాలు కార్యక్రమం నిర్వహించారు. రథ సప్తమి సందర్భంగా ఉక్కు క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున యోగా సాధకులు, యోగా అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్య నమస్కారాలు చేశారు. ఆసనాలు వేశారు.

యోగా గురువు మాట్లాడుతూ సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ప్రతీ ఒక్కరికి సూర్య భగవానుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉక్కు క్రీడా విభాగం ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గాజువాక ట్రాఫిక్ సీఐ ఆర్.సత్యనారాయణ రెడ్డి సూచించారు. గాజువాక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధి జాతీయ రహదారి నంబర్ 16, పాతగాజువాక జంక్షన్‌లో హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహన చోదకులకు శనివారం రాత్రి సీఐ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2022 సంవత్సరంలో 147 మంది ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తూ, రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా హెల్మెట్ ధరించాలని కోరారు. ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం .. కమనీయం




జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: రథ సప్తమి పురస్కరించుకుని శనివారం సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని రాతిరథంపై స్వామివారి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఏడాదిలో రథ సప్తమి రోజు మాత్రమే రాతిరథంపై స్వామివారి నిత్యకల్యాణం నిర్వహించడం పరిపాటి. ఉత్సవ మూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ,సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి, అప్పాజీ తదితరులు కల్యాణం నిర్వహించారు. రథంపై స్వామివారి కల్యాణం తిలకించి ఉభయదాతలు, భక్తులు పరవశించారు.

తప్పిన ప్రమాదం

- డివైడర్ పైకి దూసుకొచ్చిన ట్రాలర్
- జారిపడిన డ్రింక్ బాటిల్స్
- చెల్లాచెదురైన గాజుపెంకులు



ట్రాలర్ నుంచి జారిపడి చెల్లా చెదురుగా పడిన గాజు డ్రింక్ సీసాలు, పెంకులు

అక్కిరెడ్డిపాలెం: చినగంట్యాడ జంక్షన్‌లో డ్రింక్ బాటిల్స్ లోడుతో వెళ్తున్న భారీ ట్రాలర్ అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొంది. ఘటన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలివి.. పాత గాజువాక నుంచి శ్రీనగర్ వైపు ఖాళీ డ్రింక్ సీసాలతో వెళ్తున్న భారీ ట్రాలర్ చినగంట్యాడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి, ఒక్కసారిగా పక్కనున్న డివైడర్ పైకి దూసుకు వెళ్లింది. దీంతో ట్రాలర్‌పైనున్న ప్లాస్టిక్ క్రేట్‌లోని డ్రింక్ సీసాలు రోడ్డుపై పడి, గాజుపెంకులు చెల్లా చెదురయ్యాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి, ట్రాఫిక్ సమస్య తలెత్తింది. గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై పడి ఉన్న గాజు సీసాలు, పెంకులను తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.